# మాతృభాష

డియర్ దివ్యా...

ఏం చేస్తున్నావు? నేను ఏం చేస్తున్నానో తెలుసా! నీకు ఉత్తరం రాస్తున్నాను... నేను పదిరోజులు ఉత్తరం రాయకపోతే నన్ను మర్చిపోయావా? అని కోపం తెచ్చుకొంటావు... కానీ నీకేం తెలుసు నేనిక్కడ ఓ పంజరంలో చిలకలా బ్రతుకుతున్నానని.

దివ్యా!... నాక్కూడా నీలా హాస్టల్లో వుండి చదువుకోవాలని పిచ్చి కోరిక... కానీ బాడ్‌లక్... నాకేం నీలాగా ఇంజనీరింగ్ - మెడిసిన్ చదివే అదృష్టం లేదుగా.. నా శక్తి ఇంతే అంటూ అమ్మ నన్ను డిగ్రీలో చేర్పించింది.

తండ్రి లేని దాన్ని... అమ్మ రెక్కల కష్టం మీద ఆధారపడి బ్రతుకుతున్నదాన్ని.. అమ్మ తప్ప... నా కంటూ ఇంకెవరూ లేని ఒంటరిదాన్ని... ప్రతి నిమిషం... ప్రతి విషయంలోనూ రాజీపడుతూ బ్రతకమని రాసిపెట్టి వుంది కాబోలు నా నుదుటిమీద.. అందుకే రాజీతో బ్రతుకుతూ, అపరాజితను కావాలని అనిపిస్తోంది. ఏవిటిలా రాస్తున్నానని విస్తుబోతున్నావా?... ఈ భాష దీనికెలా వచ్చిందని ఆశ్చర్యపడుతున్నావా?... ఈ మధ్య నవలలు బాగా చదువుతున్నాను... ఈ టీవిలో సీరియల్స్ కూడా రెగ్యులర్‌గా చూస్తున్నాను.. ఎందుకోగానీ.. ప్రతి స్త్రీ పాత్రలోనూ నాకు నేనే కనిపిస్తుంటాను. ఎన్నో స్త్రీ పాత్రలకున్న కష్టాలన్నీ నాకే వున్నాయనిపిస్తుంటుంది. ఎందుకిలా రాస్తున్నానని ఆశ్చర్యపోకు.. మా అమ్మ క్రమశిక్షణ పేరుతో నన్ను ఎంతగా చిత్రవధ చేస్తోందో అర్థమైనకొద్దీ... ఈ జీవితంలో నేను కోల్పోయిందేవిటి!... పొంద లేకపోతున్నదేవిటో తెలుస్తోంది... ఆవిడ గీసిన సర్కిల్‌లో కుంచించుకుపోయి బ్రతుకుతున్నానేమో... నాకు ఎందుకో అకస్మాత్తుగా స్వేచ్ఛ కావాలని పిస్తోంది... ఈ మధ్య నాకు కల్లో ఎగిరే పక్షులు... ఆకాశంలో అల్లనల్లన కదిలే

మేఘాలు.. పచ్చని పచ్చిక మైదానాల్లో గంతులేసే లేడిపిల్లలూ, కొండలమీంచి జారే జలపాతాలూ... గలగలపారే సెలయేళ్ళూ... తరచూ కన్పిస్తున్నాయి. వీటన్నిటిలో ఏదో ఒకటిగా మారిపోతే ఎంతబాగుండు! అనిపిస్తోంది.

దివ్యా! వైజాగ్ వెళ్ళిన ఈ ఏడాదిలో నాకు ఓ అబ్బాయితో పరిచయమైంది. నీతో ఎక్కువగా తిరుగుతూ, కబుర్లు చెప్తుంటేనే అమ్మ అస్తమానం టైమ్‌వేస్ట్ చేస్తున్నానని.. చదువునిర్లక్ష్యం చేస్తున్నానని తిడుతుండేది.. అలాంటిది ఈ అబ్బాయితో నేను స్నేహం చేశానని, మా స్నేహం దినదిన ప్రవర్ధమానమవుతోందని తెలిస్తే నన్ను సజీవ సమాధి చేస్తుంది కదూ! అసలే అమ్మకి ఈ సంఘం అన్నా... ఈ సంఘంలో తన పరువు ప్రతిష్టలు అన్నా చాలా భయం... నేను కాలేజీ నుంచి అరగంట ఆలస్యంగా వస్తే వాకిట్లోనే నిల్చుంటుంది. టి.వి. ముందు.. కొంచెం మైమరిచిపోతే పులిలా గాండ్రిస్తుంది.

దివ్యా! అమ్మంటే ఈ మధ్య నాకు బొత్తిగా ఇష్టం వుండటంలేదే.. ఎందుకలా ప్రతి దానికీ భయపడుతూ... నన్ను భయపెడుతుంటుందో అర్థంకాదు.. అస్తమానం చదువు చదువు అంటుంది. ఎప్పుడు చదువేనా.. నాకేం సరదాలు అఖ్కర్లేదా అంటే.. తనతో సినిమాకి.. తీసికెళ్ళింది. ఓసారి.. గోల్కొండ మ్యూజియం చూపించింది. మరోసారి.. తిరుపతి, కాళహస్తి తీసికెళ్ళింది.. దివ్యా! నువ్వు చెప్పు... ఈ వయసులో మనకి ఫ్రెండ్స్‌తో తిరగాలని వుంటుంది కానీ.. అమ్మలతో అమ్మమ్మలతో తిరగాలని వుంటుందా! ఆ మాటంటే ''నేను నీకు అమ్మనీ... నాన్నని.. అన్నని.. అక్కని.. స్నేహితురాలిని కూడా.. నీకేం కబుర్లు చెప్పాలని అనిపించినా నాకే చెప్పమ్మా''... అంటుంది. ఎలా చెప్తాను చెప్పు! అవినాష్ గురించి నీకు చెప్పినట్టు అమ్మకి చెప్పగలనా?... నాగార్జున డ్యాన్స్... వెంకటేష్ ఫైటింగ్.. చిరంజీవి యాక్షన్ నాకిష్టమని... శ్రీదేవి సోయగం... మాధురీదీక్షిత్ నవ్వు... నాకిష్టమని అమ్మతో చెప్పగలనా!... ఏవిటీ! నా సోది చెప్పి విసిగిస్తున్నాను కదూ! అన్నట్టు... టైము ఇప్పుడుపదకొండు అయింది. అమ్మ మళ్ళీ అరుస్తుంది. ''పడుకో.. పొద్దునే లేవాలి'' అని.. అమ్మకి నేను ఐదింటికి లేచి... వాకిలి ఊడ్చి కళ్లాపి చల్లి.. ముగ్గేయాలనీ.. త్వరగా స్నానం ముగించి చదువుకోవాలని కోరిక.. నాకేమో ఎంచక్కా ఎనిమిది దాకా పడుకోవాలని కోరికే...

అదేవిటో! ఈ తరానికీ... తరానికీ మధ్య అంతరాల సంఘర్షణ.. ఏ తరానికీ తప్పదేమో! మరింక ఉండనా!.. ఇంకో విషయం, రేపు నేను అవినాష్ సినిమాకెళ్తున్నాం. ఈ మధ్య క్లాసులు ఎగ్గొట్టి సినిమాకెళ్తున్నాను.. అలా అయితే అమ్మకి తెలీదుగా..

ఓ.కె. గుడ్‌నైట్

నీ స్మిత

హాయ్ దివ్యా!

నీ లెటర్ అందింది... అమ్మ ఏమంటోంది అని రాశావు... అవినాష్‌తో ప్రేమాయణం ఎందాకా వచ్చింది అని రాశావు.. అమ్మ ఏమంటోంది! ఆ మధ్య నేనూ, అవినాష్ సినిమాకెళ్ళడం మా పక్కింటావిడ చూసి అమ్మకి చెప్పింది.. అంతే.. అమ్మ గంగాదేవిలా మారింది.. అంటే అర్థమైందా? ఏడుపు.. నేను తన నమ్మకాన్ని వమ్ముచేశానట.. తన త్యాగానికి ఫలితం లేకుండా చేశానుట... మనకి చదువే ముఖ్యం.. అది నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు లేనట్టే అన్నది.

ఈ ప్రపంచంలో స్వశక్తిని మించిన శక్తి లేదుట.. ప్రేమ స్లో పాయిజన్‌ట... అది నెమ్మది.. నెమ్మదిగా మనిషిని చంపేస్తుందిట.. ఈ వయసులో వుండేది ప్రేమ కాదుట.. ఆకర్షణట.. ఈ ఆకర్షణకీ.. ప్రలోభానికి లొంగిపోతే ఎన్నటికీ వృద్ధిలోకి రానుట.. ఇలాంటివే కొటేషన్స్ చెప్పి ప్రాణం తీసింది.. చదువుకుని.. ఉద్యోగం చేస్తోన్న అమ్మకి ఇంత చాదస్తం ఏవిటసలు! అర్థం కావడంలేదు.

నన్ను కట్టడి చేయడానికి.. కాపలా కాయడానికి శక్తి లేని నిస్సహాయురాలు కాబట్టి... ఎలా జీవించాలి! అన్న విషయం నా అంతరాత్మకి వదిలేశానని అన్నది. నలుగురిలో నా పరువు కాపాడవే అని ఏడ్చింది. ఈ విషయం అవినాష్‌కి చెప్పాను.. ఈ సూక్తులూ.. నీతి బోధలూ.. నిబంధనలూ అన్నిటికీ దూరంగా వెళ్ళిపోదాం.. నాతో వస్తావా? అని అడిగాడు. స్వర్గానికి దారులు చూపిస్తానట్టు.. రమ్మన్నాడు.. రెండ్రోజులు టైమ్ అడిగాను.. బహుశా నేను అవినాష్‌తో కలిసి, ఈ స్వేచ్ఛా ప్రపంచంలోకి వెళ్ళిపోతాను. ఎక్కడికి.. ఎలా? నెక్ట్స్ లెటర్‌లో రాస్తా...

అందాకా సెలవా!

నీ స్మిత

దివ్యా! నేను అవినాష్‌తో కలిసి వెళ్లిపోవడానికి నిర్ణయించుకుని.. సూట్‌కేస్‌తో బయల్దేరాను.. అనుకోకుండా హఠాత్తుగా అమ్మ కంటబడ్డాను. అమ్మ నిర్ఘాంతపోయింది. నేనలా వెళ్లిపోవడానికి కారణం ఏవిటని అడిగింది.. మితిమీరిన ఆవిడ క్రమశిక్షణ అని చెప్పాను.. బాగా ఏడ్చింది.

''నేను పడ్డ కష్టాలు నువ్వు పడకూడదని.. మగవాడి మాయమాటలకి లొంగి.. వాళ్ళ బలిదానంలో నువ్వు మరో బలిపశువు కాకూడదని.. నిన్నంత స్ట్రిక్ట్‌గా పెంచుతున్నానే! నేను చచ్చిపోతే నీ భవిష్యత్తు అంధకారం కాకూడదని.. నేను పోయేలోపలే నీకో బలమైన.. అందమైన భవిష్యత్తు ఇవ్వాలని తపనపడుతున్నానే... ఈ లోకం మంచిది కాదమ్మా... నువ్వెంత పవిత్రంగా వున్నా.. నీ మీద బురద చల్లడానికే ప్రయత్నిస్తుంది. మగవాడి అండలేని మనం.. అందరికీ చులకన.. అందుకే జాగ్రత్తగా వుండాలి...'' అంటూ ఏవేవో అన్నది.

నిజం చెప్పద్దూ దివ్యా... నాకదంతా సుత్తిలా అనిపించింది.. ప్రపంచం ఎంతలా మారిపోతోందో అమ్మకేం తెలీదనిపించింది... ఈ కంప్యూటర్ యుగంలో కూడా ఇంకా ఆడపిల్ల అణగిమణగి వుండాలి.. ఏం చేయాలన్నా సంఘాన్ని దృష్టిలో వుంచుకోవాలి. ప్రతి అడుగూ ఆచితూచి వేయాలి. ఇలాంటి స్లోగన్స్‌నే పట్టుకు వ్రేలాడుతుందేం. సరేలే.. అన్నట్టు విషయం చెప్పనా నిన్న అవినాష్ నన్ను ముద్దు పెట్టుకున్నాడు.. అచ్చం స్టార్ టి.వి.లో ఇంగ్లీష్ పిక్చర్‌లోలా.. అబ్బా.. ఆ అనుభవం ఎంత బాగుందో.. త్వరగా వచ్చి అమ్మతో మాట్లాడి నన్ను పెళ్ళి చేసుకొంటానన్నాడు.

నా కసలు ఈ మధ్య చదువుమీద ధ్యాసే లేదు.. ఎంతసేపూ అవినాష్ ఆలోచనే.. కానీ చదువుకున్నట్టు నటిస్తున్నాను.. లేకపోతే అమ్మ అష్టావధానం ప్రారంభిస్తుంది... ఏమన్నా అంటే నేను చస్తేగానీ నా విలువ తెలీదే నీకు.. నేనెంతో కాలం బ్రతకనే అంటుంది. చాదస్తం కాకపోతే.. అనగానే పోతామా! పిచ్చి అమ్మ..

సరేలే.. ఉంటాను

నిద్రొస్తోంది.. స్మిత

దివ్యా

ఏం చేయాలో.. ఏం రాయాలో నాకు తెలీడం లేదు. నేను.. నేను..

కలగంటున్నానో.. ఇది నిజమో అర్థంకావడంలేదు.. నిన్నటిదాకా కళ్ళముందు తిరిగిన అమ్మ.. చెవుల్లో హోరెత్తిన ఆవిడ స్వరం... అన్నీ అదృశ్యమయ్యాయి.. అమ్మలేదు.. నా కళ్ళముందు నా చేతుల్లో.. మృత్యువుతో పోరాడి.. పోరాడి.. అలసిపోయి శాశ్వతంగా నిద్రపోయింది.

అవినాష్‌తో పెళ్ళి జరిగి.. నేను హాయిగా కాపురం చేసుకుంటానని... కలలు కంటోన్న నా కళ్ళు.. కన్నీళ్ళ కావిళ్ళుగా మారాయి...

హార్ట్ ఎటాక్ వచ్చి.. విలవిల తన్నుకుంటున్న అమ్మని ఏంచేయాలో! ఎలా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలో తెలీక కనిపించిన వాళ్ళనల్లా సాయం అడిగాను.. ఐస్‌క్రీం పార్లర్‌కి.. చీకటిలో టాంక్‌బండ్‌కి రమ్మని ఫోన్‌చేయగానే ఉరుకులు పరుగులతో వచ్చే అవినాష్, అమ్మకి సీరియస్‌గా వుంది రమ్మని పిలిస్తే తిరిగి చూడలేదు.. నిస్సహాయురాలినై.. శోకాలు పెడుతున్న నా బాధ భరించలేక.. చూడలేక పక్కింటి శారద భర్త శేఖర్ వచ్చి సాయం చేశాడు. హాస్పిటల్‌కి తరలించిన కొన్ని గంటలకే అమ్మ అంతిమశ్వాస తీసుకుంది.. నేను ఎంతోకాలం బ్రతకనే అని అమ్మ అంటోంటే.. ఆ.. అలా అనగానే పోతారా అనుకున్నాను.

దివ్యా! నాకు భయంగా వుంది.. బాధగా వుంది... నా చుట్టూ ఒంటరితనం నా మెదడు నిండా అమ్మస్మృతులు.. మొన్నటిదాకా చిరాకు తెప్పించిన అమ్మ నీతిబోధలు.. నాకిప్పుడు వేయికంఠాలతో వేదంలా వినిపిస్తున్నాయి.

మగవాడి మాయమాటలకు మోసపోతావే.. జాగ్రత్త అనే అమ్మ హెచ్చరికలు.. పవిత్రమైన ఖురాన్‌లోని వాక్యాలుగా ధ్వనిస్తున్నాయి. అవినాష్ నమ్మకద్రోహం.. నన్ను చిత్రవధ చేస్తోంది.. నిర్లక్ష్యంతో.. వదిలేసిన నా క్లాసు పుస్తకాలు నన్ను పరిహసిస్తున్నాయి.. అడుగడుగునా అమ్మ కంఠస్వరం...

వంటింట్లోంచి.. గిన్నెల చప్పుడుతో వంతపాడే అమ్మ చేతి గాజుల శబ్దం...

నాలుగు గోడల నుండి ప్రతి ధ్వనిస్తోన్న ఆవిడ పాదాల మంజీరనాదం.. నా అణువణువునా అమ్మ చేతి స్పర్శ...

దివ్యా... ఈ ఒంటరితనం నన్ను పిచ్చిదాన్ని చేస్తోంది..

ఎప్పుడో.. ఎక్కడో.. నేను చదివాను.. కన్ను తెరిస్తే జననం...

కన్నుమూస్తే మరణం.. ఈ రెండిమధ్య రెప్పపాటు కాలమేజీవితం. ఈ వాక్యానికి అర్థం తెలిసింది. ''నేను పోతాను.. నేను పోతాను'' అని అమ్మ అంటే అందరం ఎప్పటికైనా పోయేదేగా అనుకున్నాను..

అమ్మ చనిపోవడంలోని వాస్తవాన్ని అనుభవిస్తోన్న నాకు.. అనిపిస్తోంది. ఇదేనా జీవితమంటే.. అని.

భావానికీ.. అనుభవానికి మధ్య ఇంత దూరం వుంటుందని ఆ దూరం పేరు వేదన అనీ.. అది నా గుండెనిలా కోస్తుందని నేనూహించలేదు.

జీవితం అంటే సూర్యరశ్మిలో క్షణకాలం మెరిసే నీటిబిందువని.. ఏ క్షణాన్నైనా అది అవిరవుతుందని నేననుకోలేదు.

ఇంతకాలం అమ్మ నన్ను అరళ్ళుపెడుతోందని.. అర్థంలేని శాసనాలతో నాకు స్వేచ్ఛ లేకుండా చేస్తోందనీ ఎద్దేవాగా అనుకున్నాను. ఆవిడ చెప్పేవన్నీ నీతిసూత్రాలనీ.. సోది అనీ విసుకున్నాను.

కానీ, ఇప్పుడు తెలుస్తోంది.. అవన్నీ ఆవిడ అనుభవాలన్నిటినీ అక్షరాలుగా మార్చి, ఓ ఉపాధ్యాయినిలా నాకు బోధించిన బ్రతుకు పాఠాలని...

ఇప్పుడు తెలుసుకుని ఏం చేయగలను.. ఆ పాఠాలేవీ నా బుర్రకెక్కకుండానే.. నాలో జీర్ణం కాకుండానే అమ్మ తన ఆఖరి ప్రయాణం సాగించింది.

దివ్యా! ఎందరో మహానుభావులు జీవితాన్ని అనేక విధాలుగా నిర్వచించి వుండచ్చు గాక.. కానీ, ఏ మేధావి జీవితాన్ని శాసించలేక పోయాడు. ఈ ప్రపంచంలో ఎక్కడైనా అలా శాసించగలిగే మేధావి వుంటే నేనాయనకి బానిసనై వుండేదాన్ని.. అమ్మ జీవితాన్ని శాసించి ముగిసిపోకుండా కాపాడుకోడానికి.. కానీ.. ఇప్పుడా అవకాశంలేదు. అమ్మకేం వయసు మించిపోయిందని.. ఇలా మాట్లాడుతోంది అనుకున్నానప్పుడు.. నిజమే.. నేను కళ్ళు తెరిచిన దగ్గర్నించీ నాతోనే వుండి, నాతో నడిచి, నన్ను నడిపించి, నాతో మాట్లాడి, నన్ను మాట్లాడించి, నాతో కలిసి భోజనం చేస్తూ మారాం చేసే నాకు ఎంతో అప్యాయంగా తినిపించి, అమ్మ, అలాగే వుంటే.. అమ్మ వయసు సంగతి నాకు గుర్తురాలేదు.. వయసుతోపాటు ఆరోగ్యం క్షీణిస్తుందనీ.. శారీరక

ఆరోగ్యంమీద మానసిక అనారోగ్యం ప్రభావం చూపిస్తుందనీ నాకు తెలీలేదు.. ఆవిడ మానసిక అనారోగ్యానికి కారణం నేనేననీ.. నాకు తెలీలేదు.

కానీ అవన్నీ తెలిసిన ఈనాడు.. నేను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకునే మార్గాల్ని అన్వేషిస్తున్నాను.

ఎన్నటికీ.. మరెన్నటికీ తిరిగిరాని అమ్మ పాదాలని నా కన్నీటితో అభిషేకించాలని, నా సర్వశక్తులూ ధారపోసి ఆ తల్లికి సువర్ణాభిషేకం చేయాలనీ ఆరాటపడుతున్నాను. నమ్మకద్రోహానికి గురై.. కన్నవారిచేత.. సంఘంచేతా వెలివేయబడిన అమ్మ ఎందుకు నా పట్ల కఠినంగా ప్రవర్తించేదో.. చదువుకో.. చదువుకో అని పోరేదో ఇప్పుడర్థమైంది.

దివ్యా! ఇప్పుడు నాకెవరూ లేరు..

ఈ విశాల ప్రపంచంలో.. అవినీతి.. అరాచకత్వం ప్రబలిపోయింది. ఈ ఆటవిక రాజ్యంలో ఒంటరిగా మిగిలిపోయిన ఓ కుందేలుని..

నాకు ఏమి తెలీదు..

ఈ ప్రపంచం గురించి తెలీదు.. మాయలూ, మర్మాలూ మోసాలు.. కల్మషాలూ ఏవీ తెలీవు..

నాచుట్టూ వున్నవాళ్ళు నాకు ఆత్మీయులో.. శత్రువులో.. నా హితం కోరేవారో.. నా నాశనం కోరేవారే తెలీదు.

నా భవిష్యత్తేవిటి!.. నా గమ్యం ఏవిటో తెలీదు..

నా మెదడు నిండా రకరకాల ఆలోచనలు..

వాటికి రూపంలేదు..

నా గుండెనిండా ఎన్నో భావాలు..

వాటికి బాషలేదు..

నా కళ్ళనిండా కోరికలు..

అది తీరే మార్గం లేదు.

నా పెదవుల చాటున ఎన్నో కథలు..

వాటికి భాష్యం లేదు.

ఈ కథలు.. భావాలు.. కోరికలు వెలిబుచ్చే అవకాశం నాకు లేదు.. పంచుకునే ఆత్మీయులు లేరు.. ఎదుటివారికి అర్థమయేలా వ్యక్తం చేసేందుకు తగిన బాష కూడా నాకు రాదు..

ఇంతకాలంగా నాకు ఎన్నో హితబోధలు చేస్తూ.. శాపిస్తూ... భవిష్యత్తునెలా అందంగా.. ఆకర్షణీయంగా మలచుకోవాలో వివరించిన నా మాతృబాష అంతరించిపోయింది.

ఇప్పుడా భాషలేదు.. ఆ శాసనాలు లేవు.. బోధనలూ లేవు. నా మాతృబాషను కోల్పోయిన నేనీవాళ ఓ మూగజీవిని.. గుండెల్లో బడబాగ్ని చెలరేగుతున్నా.. గొంతులో భావాలు పొంగుతున్నా ఎవరికీ తెలియజేయలేని అవ్యక్తురాల్ని.. తెగిపోయిన నా కంఠనాళాలు తిరిగి అతుక్కోవాలన్నా.. మూగబోయిన నా స్వరం తిరిగి పలకాలన్నా.. నాకు నా మాతృభాష కావాలి.. అవును దివ్యా..! నాకు అమ్మ కావాలి.. అమ్మ కావాలి...

విశాలాంధ్ర
తేది 5-4-1998